www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక : 05 గురువారం 01 - 05 - 2025 ఎడిటర్ : పి. జయరాం పేజిలు : 8 వెల : 4

## అక్రమంగా గోవులు తరలింపు



3

## మోదీ రష్యా పర్యటన రద్దు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటన రద్దయింది. షెడ్యూల్ ప్రకారం మే 9న రష్యాలో జరిగే "విక్టరీ డే" సెలబ్రేషన్స్‌లో మోదీ పాల్గొనాల్సి ఉంది. అయితే ఆయన పర్యటన రద్దయినట్టు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలిపారు. పహల్గాంలో 26 మంది టూరిస్టులను ఉగ్రవాదులు కాల్చిచంపడంతో భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీపై సోవియట్ రష్యా విజయానికి చిహ్నంగా 80వ 'విక్టరీ డే 'ను రష్యా జరుపుకోనుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 జూలైలో

2

## భారత్‌కు లండన్ మద్దతు

### ఉగ్రవాద నిర్మూలనకు చేసే పోరాటంలో మద్దతు ఉంటుందని వ్యాఖ్య



తొలిఅడుగు, న్యూఢిల్లీ :లండన్‌లో పహల్గామ్ దాడికి వ్యతిరేకంగా ప్రదర్శన చేస్తున్న భారతీయులను పాకిస్థాన్ హైకమిషన్ అధి కారి బెదిరిం చినట్లు వచ్చిన వీడియోపై బ్రిటన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు బ్రిటన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలి పారు. పహల్గామ్ ఉగ్రదాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపి ంది. ఈ దాడికి పాల్పడిన దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని

2

## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల


### - పదో తరగతి ఫలితాల్లో 98.2 శాతం ఉత్తీర్ణత




తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల య్యాయి. సీఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతి వేదిక విడుదల చేశారు. పదో తరగతి ఫలితాల్లో 98.2 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఏకంగా 98.7% ఉత్తీర్ణత నమోదైంది. గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఫలితాల కోసం అభ్యర్థులు అధికారిక

2

## కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు.?





- అసెంబ్లీకి రానప్పుడు కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు..
  సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కేసీఆర్ పదేళ్లు ఫామ్‌హౌస్‌లోనే ఉండాల్సిందే

తొలిఅడుగు, హైదరాబాద్ : కొట్లాడి తెచ్చుకున్న తెలం గాణ పదేళ్లు గుంపు పాలైం దని.. కాళేశ్వరం సహా ఏ పథకం మీదైనా చర్చకు సిద్ధమేనంటూ రేవంత్ రెడ్డి ప్రకటించారు. తమ నిర్ణయాల్లో లోపాలు ఉంటే సవరించు కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని కేసీఆర్ మాట్లాడుతు న్నారంటూ రేవంత్ మండిపడ్డారు. అసెంబ్లీకి రాను పిల్లలను పంపుతానని మాట్లాడుతున్నారు.. సభకు రానప్పుడు ప్రతిపక్షహోదా మీకెం దుకు?.. సభకు రానప్పుడు ప్రశ్నించే హక్కు మీకు ఎలా వస్తుంది..? అధికారం ఉంటేనే బయటకు వస్తారా.. అంటూ బీఆర్ఎస్ పార్టీ వజ్రోత్సవ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అధికారం లేకపోతే ఫామ్‌హౌస్ నుంచి బయటకు రారా..? అంటూ ప్రశ్నించారు. తాము పదేళ్లు అధికారంలో ఉంటామని.. కేసీఆర్ పదేళ్లు ఫామ్‌హౌస్‌లోనే ఉండాల్సిందే నంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యాని ంచారు. బీఆర్ఎస్ సభలో కేసీఆర్.. ప్రభుత్వ పథకాలు ఆగాయంటూ పేర్కొనడంపై సీఎం రేవంత్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. కేసీఆర్

2

కడుపు నిండా విషం పెట్టుకుని కేసీఆర్ మాట్లాడుతు న్నారంటూ రేవంత్ మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణను కేసీఆర్‌కు.. విమర్శించే హక్కు లేదాని సీఎం రేవంత్ రెడ్డి న్నారు.

## కుప్పకూలిన పాక్ స్టాక్ మార్కెట్




### భారత్ సైనిక చర్య చేపట్టవచ్చన్న పాక్ మంత్రి హెచ్చరిక కారణం

తొలిఅడుగు, ఇంటర్నెట్ డెస్క్: భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు పాకిస్థాన్ స్టాక్ మార్కెట్‌ను కుదిపేశాయి. భారత్ రానున్న 24 నుంచి 36 గంటల్లో సైనిక చర్యకు దిగవచ్చుని పాకిస్థాన్ సమాచార శాఖ

2



## టీజీపీఎస్సీపై హైకోర్టు ప్రశ్నల వర్షం

తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియలో అవక తవకలు జరిగాయన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా

2

## తప్పుడు కేసులు పెట్టి వేధించారు

### బెదిరించి బీఆర్ఎస్ ఎన్నికల బాండ్లు కొనిపించారు



తొలిఅడుగు, హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు తనను బెదిరించి బీఆర్ఎస్ పార్టీ పేరిట ఎన్నికల బాండ్లు కొనిపించారని.. ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని హైకోర్టుకు సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తన వాదన కూడా వినాలంటూ శ్రీధర్‌రావు ఇంప్లీడ్ అయ్యారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌రావు కీలకంగా వ్యవహరించారని శ్రీధర్‌రావు వివరించారు. తన ఫోన్ ట్యాప్ చేసి కదలికలపై నిఘా పెట్టారని.. బెంగళూరు వెళ్తే అక్కడికి వచ్చి అరెస్ట్ చేశారని తెలిపారు. తనపై 25 తప్పుడు క్రిమినల్ కేసులు పెట్టి బెదిరించారని, భారీగా డబ్బు డిమాండ్ చేశారని.. బీఆర్ఎస్ పార్టీ పేరిట ఎన్నికల బాండ్లు కొనిపించారని ఆరోపించారు. ప్రభాకర్‌రావు వల్ల తాను బాధితుడిగా మారినందున.. ప్రభాకర్‌రావుకు

## విజయవాడలో వైఎస్ షర్మిల అరెస్టు



తొలిఅడుగు, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు రాలు (పీసీసీ) వైఎస్ షర్మిలను విజయవాడ పోలీసులు అరెస్టు చేసి గన్నవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు పంపించారు. మోదీ శంకుస్థాపన చేసిన ఉద్దండరాయుని పాలెంలో పర్యటిస్తానని ఆమె పేర్కొనడం, విజయవాడ కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం వంటి పరిణామాల నేపథ్యంలో పోలీసులు వైఎస్ షర్మిలను అదుపులోకి తీసుకు న్నారు. అనంతరం ఆమెను గన్నవరం విమానాశ్రయం వద్దకు తీసుకువెళ్లి హైదరాబాద్ పంపించారు. పీసీసీ అధ్యక్షురాలు

2

## అంగన్‌వాడీలకు సమ్మర్ సెలవులు




తొలిఅడుగు, హైదరాబాద్ : ప్రస్తుతం తెలంగాణలో విద్యాసంస్థలకు సమ్మర్ హాలిడేస్ కొనసాగుతు న్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు విద్యార్థులకు సెలవులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో

2

# మోదీ రష్యా పర్యటన రద్దు

**మొదటిపేజీ తరువాయి** రష్యాలో పర్యటించారు. దానికి ముందు 2019లో వ్లాడివోస్టోక్ సిటీలో జరిగిన ఎకనామిక్ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు. కాగా, ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి గట్టి జవాబు ఇచ్చి తీరుతామని భారత్ విస్పష్టంగా ప్రకటించింది. ఈ దుశ్చర్యకు పాక్ ఉగ్రమూకలే బాధ్యులని భారత్ గట్టి ఆధారాలు చూపుతోంది. 2019లో పుల్వామా దాడి అనంతరం జరిగిన అతిపెద్ద ఉగ్రదాడి కావడంతో పహల్గాం ఉగ్రమూకలను ఎక్కడున్నా వేడాడతామని భారత్ ప్రతినబూనింది. ఈ దాడికి తామే కారణమంటూ లష్కరే తొయిబా అనుబంధ సంస్థ రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించడంతో భారత్ భగ్గుమంటోంది. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేందుకు భారత సైన్యానికి కేంద్రం పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్టు ప్రకటించింది. తేదీ, సమయం, టార్గెట్‌ను నిర్ణయించుకునే స్వేచ్ఛ సాయుధ బలగాలకు ఇచ్చింది.

# భారత్‌కు లండన్ మద్దతు

**మొదటిపేజీ తరువాయి** కెనడా విదేశాంగ శాఖ ప్రతినిధి భారత్‌ను కోరారు. ఉగ్రవాద నిర్మూలనకు న్యూఢిల్లీ చేస్తున్న పోరాటంలో తమ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్‌లతో తమకు స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగాలని తాము కోరుకోవడం లేదని అన్నారు. కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన బాధ్యత భారత్, పాకిస్థాన్‌లపై ఉందని బ్రిటన్ సూచించింది.

# టెన్త్ ఫలితాలు విడుదల




**మొదటిపేజీ తరువాయి** వెబ్‌సైట్ చూసుకోవచ్చు. కాగా, ఈ ఏడాది మార్కుల మెమో రూపంలో కొన్ని కీలక మార్పులు చేపట్టారు. గతంలో విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు, సీజీపీఏలు మాత్రమే ఇచ్చే విధానానికి బదులుగా.. ఈసారి రాత పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ మార్కులను విడిగా చూపిస్తూ.. మొత్తం మార్కులు, గ్రేడ్లను మెమోలో చేర్చారు. కనీస మార్కులు వస్తే పాస్ అని, లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదు చేస్తారు. ఇక, ఈ ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగిన టెన్త్ పరీక్షలకు సుమారు 5,09,403 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,58,895 మంది బాలురు, 2,50,508 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 కేంద్రాల్లో ఎగ్జామ్స్ జరిగాయి.

# అంగన్‌వాడీలకు సమ్మర్ సెలవులు



**మొదటిపేజీ తరువాయి**

అంగన్‌వాడీలకు కూడా తెలంగాణ ప్రభుత్వం సెలవులును ప్రకటించింది. మే 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు వేసవి సెలవులను ప్రకటిస్తున్నట్లు వెల్లడించింది. అయితే ఈ సెలవుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ ద్వారా గుడ్లు, సరుకులు సరఫరా చేయనుంది. సెలవుల్లో అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటి సర్వే వంటి విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే వేసవి కాలంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీఐటీయు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఇటీవల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే అంగన్‌వాడీ యూనియన్ల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులును ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ నెల ముగిసి మే నెల వచ్చేసింది. ఎండలు మరింత తీవ్రతం అయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# కుప్పకూలిన పాక్ స్టాక్ మార్కెట్

**మొదటిపేజీ తరువాయి** మంత్రి హెచ్చరించడంతో పెట్టుబడిదారుల్లో భయాందోళనలు తలెత్తాయి. ఈ భయాలతో బుధవారం ట్రేడింగ్‌లో పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ నష్టాలను చవిచూసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి కీలకమైన కేఎస్ఈ-100 సూచీ ఏకంగా 3,545.61 పాయింట్లు (3.09 శాతం) పతనమైంది. మంగళవారం 114,872.18 వద్ద ముగిసిన సూచీ, బుధవారం 111,326.58 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత్ రాబోయే 24 నుంచి 36 గంటల్లో పాక్‌పై సైనిక దాడులకు పాల్పడే అవకాశం ఉందని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతవుల్లా తరార్ చేసిన ప్రకటన మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీసిందని ఇస్మాయిల్ ఇక్బాల్ సెక్యూరిటీస్ సీఈఓ అహ్ఫాజ్




ముస్తఫా తెలిపారు. "మంత్రి ప్రకటనతో పెట్టుబడిదారులు భయపడి, ప్రస్తుతానికి ఈక్విటీల నుంచి వైదొలగి సురక్షిత మార్గాలను చూసుకుంటున్నారు" అని ఆయన పేర్కొన్నారు.

# టీజీపీఎస్సీపై హైకోర్టు ప్రశ్నల వర్షం

**మొదటిపేజీ తరువాయి** న్యాయస్థానం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అనుసరించిన విధానాలపై పలు కీలక ప్రశ్నలు సంధించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, వరుస క్రమంలో హాల్ టికెట్ నంబర్లు కలిగిన కొందరు అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు లభించాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, నిబంధనల ప్రకారం ప్రొవిజనల్ మార్కుల జాబితాను నిర్ణీత సమయంలో వెల్లడించలేదని, సుమారు 20 రోజుల తర్వాత తుది మార్కులను ప్రకటించారని తెలిపారు. ఈ మధ్యకాలంలో అవకతవకలు జరిగి ఉండవచ్చనే అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, టీజీపీఎస్సీ అనుసరించిన మూల్యాంకన ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకుంది. ముఖ్యంగా, తెలుగు మాధ్యమంలో పరీక్ష రాసిన అభ్యర్థుల జవాబు పత్రాలను ఎలా మూల్యాంకనం చేశారని ప్రశ్నించింది. "తెలుగులో పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వేశారనే ఆందోళన వ్యక్తమవుతోంది. మూల్యాంకనం కోసం జవాబులకు సంబంధించి ఏదైనా 'కీ' పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాలకు వేర్వేరుగా 'కీ' ఇచ్చారా?" అంటూ టీజీపీఎస్సీని న్యాయస్థానం ప్రశ్నించింది.

దీనికి టీజీపీఎస్సీ ప్రతినిధులు స్పందిస్తూ, ఇది రాతపూర్వక పరీక్ష అయినందున మూల్యాంకనం చేసే నిపుణులకు ఎలాంటి 'కీ' పేపర్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. జవాబు పత్రాలను దిద్దిన వారంతా సంబంధిత సబ్జెక్టులలో నిపుణులని, వారి నైపుణ్యం ఆధారంగానే మూల్యాంకనం జరిగిందని కోర్టుకు వివరించారు. అనంతరం, ఈ గ్రూప్-1 పరీక్షలో తెలుగు మాధ్యమంలో ఎంతమంది పరీక్ష రాశారు, వారిలో ఎంతమంది తుది ఎంపిక జాబితాలో ఉన్నారు అనే వివరాలను సమర్పించాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గతంలో జరిగిన గ్రూప్-1 పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందిస్తామని కమిషన్ కోర్టుకు తెలియజేసింది. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులు ఏళ్ల తరబడి గ్రూప్-1 నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, ఈ నేపథ్యంలో కేసు విచారణను అనవసరంగా ఆలస్యం చేయకుండా త్వరితగతిన ముగించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

# కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు.?

తెచ్చిన పథకాల్లో ఏ పథకం ఆగిందో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉచిత కరెంట్, కళ్యాణలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా ఎన్నో పథకాలు అమలవుతున్నాయి. ఈ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు కేసీఆర్‌కు కనబడటం లేదా? అని ప్రశ్నించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ పదేళ్లు గుంపు పాలైందని.. కాళేశ్వరం సహా ఏ పథకం మీదైనా చర్చకు సిద్ధమేనంటూ రేవంత్ రెడ్డి ప్రకటించారు. తమ నిర్ణయాల్లో లోపాలు ఉంటే సవరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని కేసీఆర్ మాట్లాడుతున్నారంటూ రేవంత్ మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణను కేసీఆర్‌కు.. విమర్శించే హక్కు లేదన్నారు. పదేళ్ల పాలనలో ప్రజలకు కాదు. మీ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చుకున్నా రంటూ సీఎం రేవంత్ విమర్శించారు.



# తప్పుడు కేసులు పెట్టి వేధించారు

**మొదటిపేజీ తరువాయి** బెయిల్‌ను వ్యతిరేకించే హక్కు తనకు ఉందని వివరించారు. అమెరికాలో కూర్చుని బెయిల్ ఇస్తేనే ఇక్కడికి తిరిగి వస్తానని ఆయన చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఇక ప్రభాకర్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ బెయిల్ పిటిషన్‌లో శ్రీధర్‌రావు జోక్యం ఏమిటని ప్రశ్నించారు. శ్రీధర్‌రావుపై 25 క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆయన వాదనలు వినాల్సిన అవసరం అసలే లేదని పేర్కొన్నారు. శ్రవణ్‌రావు తరహాలో ముందస్తు బెయిల్ ఇవ్వాలని, ప్రభాకర్‌రావు భారత్‌కు తిరిగొచ్చి దర్యాప్తు అధికారి ఎదుట హాజరవుతారని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

# విజయవాడలో వైఎస్ షర్మిల అరెస్టు

**మొదటిపేజీ తరువాయి** వైఎస్ షర్మిల బుధవారం రాజధాని ప్రాంతంలో పర్యటించాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో తొలుత గన్నవరంలో ఆమెను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వం, పోలీసుల వైఖరిని ఖండిస్తూ వైఎస్ షర్మిల కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన దీక్షకు దిగారు. అంతలోనే ప్రధాని మోదీపై షర్మిల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ కార్యకర్తలు ఏపీసీసీ కార్యాలయంలోకి దూసుకువచ్చారు. పార్టీ కార్యాలయంపై కోడిగుడ్లతో దాడి చేశారు. షర్మిల వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు వైఎస్ షర్మిలను అరెస్టు చేసి గన్నవరం విమానాశ్రయం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం అక్కడి నుంచి ఆమెను హైదరాబాద్‌కు పంపించారు.

## జోనల్ కమిషనర్ గా ఐఏఎస్ హేమంత్ బాధ్యతల స్వీకరణ

శేరిలింగంపల్లి / తొలిఅడుగు : శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా ఐఏఎస్ హేమంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్ గా ఉపేందర్ రెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పలువురు ఐఏఎస్ లను బదిలీలు చేయడంతో పాటు పలు శాఖలకు బదిలీలు చేసింది. అందులో బనాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా హేమంత్ ను ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆయన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఉపేందర్ రెడ్డి హెచ్ ఎం డి ఏ విభాగంలోకి బదిలీ కాగా ఆయన హయాంలో కొంత అక్రమ నిర్మాణాలు అడ్డుకోలేకపోయారని ప్రజల నుంచి అభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఓ వైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైడ్రాను తెచ్చి నగరంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చూస్తుంది. అందులో భాగంగా ఇక్కడికి ఐఏఎస్ అధికారి హేమంత్ ను ప్రభుత్వం నియమించడం.. భవిష్యత్తులో ఆయన ఎటువంటి కార్యాచరణతో ముందుకెళ్తారనే ఆసక్తి నెలకొంది.



## బీజేపీ,కాంగ్రెస్,బీసీ సేన తదితర సంఘాల ఆధ్వర్యంలో..

**- బసవేశ్వర జయంతి సందర్భంగా ఘన నివాళులు**

తొలి అడుగు న్యూస్ – షాద్ నగర్ : జగజ్యోతి బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని బీజేపీ,కాంగ్రెస్,బీసీ సేన మరియు తదితర సంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా బసవన్న గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ బసవేశ్వరుడు కేవలం ఒక తత్వవేత్త కాదు సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి కాయకమే కైలాసం వంటి మహానీయ సూత్రాలను జీవనవిధానంగా మార్చిన విప్లవకారుడు అని పేర్కొన్నారు. అలాగే సమాజంలో సామాజిక న్యాయం, కులాల నిర్మూలన కోసం ఆయన చూపిన మార్గం ఈ కాలంలో మరింత అవసరమైందని హితవు పలికారు. కార్యక్రమంలో



బీజేపీ, కాంగ్రెస్ బీసీ సేన జిల్లాఅసెంబ్లీ నేతలు, యువమోర్చా నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు..

# అక్రమంగా గోవులు తరలింపు






భద్రాద్రి కొత్తగూడెం / బూర్గంపాడు/ ఏప్రిల్ 30/ అక్షరం న్యూస్ : బూర్గంపాడు మండలం, తాళ్ల గొమ్మూరు, కోయగూడెం శివారు ప్రాంతం నుండి రెండు ట్రాలీల ద్వారా అక్రమంగా, గోవులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు, తాళ్ల గొమ్మూరు స్థానిక యువకులు, అక్షరం మండల రిపోర్టర్ వాటిని పట్టుకోవడం జరిగింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీస్ సిబ్బంది వాటిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ఆ తరువాత వాటిని గోశాలకి తరలిస్తామని తెలిపారు .

# ఎ1 టూస్టార్ ఫిట్నెస్ క్లబ్ ప్రారంభోత్సవం..

- ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..
- హాజరైన సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మరియు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు..
- వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి..





తొలి అడుగు న్యూస్ – షాద్ నగర్ : ప్రతి ఒక్కరు ఆరోగ్య వంతగా ఉండాలంటే వ్యాయామాని వారి యొక్క దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని వ్యాయామంతో ఆరోగ్యాని మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరు గ్రామంలో నూతనంగా వడ్డే యాదగిరి ఏర్పాటు చేసిన ఎ1 టూస్టార్ ఫిట్నెస్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై ఎ1 టూస్టార్ ఫిట్నెస్ క్లబ్ ని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణ్ రెడ్డి,మాజీ సర్పంచ్ జిల్లెల వెంకటరెడ్డి,పిఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ పిఏసీఎస్ చైర్మన్ విట్టల్, మాజీ సర్పంచ్ లు గోవింద్ అశోక్, జెట్ట కుమార్,సత్తయ్య,మాజీ ఎంపిటిసి కట్న మాదవి రవీందర్ నాయకులు మెండెకృష్ణ,బండ మల్లేష్,సములయ్య,కొమ్ము వెంకటయ్య,భూపాల్, శ్రీశైలం,శ్రీను,రమేష్ గౌడ్ శివ చారి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు..

# షాద్ నగర్ బస్ స్టాండ్ లో మజ్జిగ పంపిణీ..

తొలి అడుగు న్యూస్ – షాద్ నగర్ : వాసవి వనిత క్లబ్ షాద్ నగర్ వారి ఆధ్వర్యంలో షాద్ నగర్ బస్టాండ్ లో అక్షయ తృతీయ సందర్భంగా సామాజికవేత్త నీల రవీందర్ మజ్జిగ పంపిణీ సహకరించడం జరిగింది వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బస్టాండ్లో వేసవికాలంలో దాతల సహకారంతో చల్లటి నీరు మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో షాద్నగర్ వాసవి క్లబ్ అధ్యక్షులు కల్వ మాణిక్యం గుప్తా మరియు వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియ నీల ప్రవీణ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నీల రవీందర్ మాట్లాడుతూ వేసే కాలంలో చల్లటి నీరు మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం



ఎంతో అభినందించదగ్గ విషయమని షాద్నగర్ వాసవి క్లబ్ అధ్యక్షులు కల్వమాణిక్యం ని అభినందించడం జరిగింది...

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 100% ఉత్తీర్ణత

తొలిఅడుగు, జనగామ, ఏప్రిల్ 30 : 2025-మార్చి/ఏప్రిల్ నెలలో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్షల్లో కుందానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పరీక్షలకు హాజరైన 22 మంది విద్యార్థినీ విద్యార్థులకు గానూ 22 మంది ఉత్తీర్ణత(100%) సాధించారు. వీరిలో 526 మార్కులతో ఈ. అక్షయ ప్రథమ స్థానంలో మరియు డి. సాయికుమార్ 513 మార్కులతో ద్వితీయ స్థానంలో సానియా: 507 మార్కులతో నిలిచారు. విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల పాఠశాల




ప్రధానోపాధ్యాయులు బిట్ల రవిశంకర్,ఎ ఎ పీ సి చైర్ పర్సన్ కొంగరి సుమలత , విద్యార్థినీ విద్యార్థులను మరియు ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను హృదయపూర్వకంగా అభినందించారు.

# రాశి ఫలితాలు



మేషం : సమాజంలో విశేషంగా పలుకుబడి పెరుగుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులు నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో నూతన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. ఉద్యోగస్తులకు పదవులు పెరుగుతాయి.

వృషభం : నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాదాలకు సంబంధించి ఆప్తుల నుండి కీలక సమాచారం అందుతుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమ ఫలిస్తుంది. వృత్తి వ్యాపారాలలో మేలైన ఫలితాలు పొందుతారు. సంతానం విద్యా ఫలితాలు సంతృప్తి కలిగిస్తాయి.

మిధునం : బంధుమిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఇతరులకు ధన పరంగా మాట ఇచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటారు. చేపట్టిన పనులు ఆకస్మికంగా వాయిదా వేస్తారు. కుటుంబ విషయంలో స్థిరమైన ఆలోచనలు చెయ్యలేరు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి తప్పదు.

కర్కాటకం : పాత రుణాలు తీర్చడానికి నూతన ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది. చిన్ననాటి మిత్రులతో కలహ సూచనలున్నవి. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు మందగిస్తాయి.

సింహం : గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగార్థులకు ఆశించిన స్థాన చలనాలు కలుగుతాయి.

కన్య : దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆదాయ మార్గాలు మెరుగుపడతాయి. దీర్ఘకాలిక రుణాలు తీర్చగలరు. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ వాతాహావరణం అనుకూలంగా ఉంటుంది. నిరుద్యోగుల కలలు సాకారం అవుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు కలిసివస్తాయి.

తుల : కొన్ని వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనుల్లో పురోగతి సాధిస్తారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. సోదరులతో దీర్ఘకాలిక వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగ విషయంలో చిన్నపాటి ఇబ్బందులు ఉన్నప్పటికీ అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. విద్యార్థులు మరింత కష్టపడాలి.

వృశ్చికం : చేపట్టిన పనులు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. కొన్ని వ్యవహారాలలో కావలసిన వారే మోసగిస్తారు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రహారాలు ఉండవు. వ్యాపారాలు తీసుకున్న నిర్ణయాలు కలిసిరాక నిరాశ కలిగిస్తాయి.

ధనస్సు : సమాజంలో విశేషమైన గౌరవమర్యాదలు కలుగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు లాభదాయకంగా ఉంటాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తవుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ పెరుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం : అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు మరింత కలవర పెడతాయి. బంధు మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు నూతన బాధ్యతలు వలన విశ్రాంతి ఉండదు.

కుంభం : ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో అవసరానికి మించి ఖర్చు చేయవలసి వస్తుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థికంగా కొంత ప్రతికూల పరిస్థితులుంటాయి. ఉద్యోగస్తులకు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడంలో లోపాలు ఉంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

మీనం : ఆర్థిక లావాదేవీలు కొంత మందకోడిగా సాగుతాయి. శ్రమతో గాని కొన్ని పనులు పూర్తి కావు. కుటుంబ పెద్దలతో కల సూచనలు ఉన్నవి. దూర ప్రయాణాలలో వాహనం ఇబ్బందులు ఉంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. నిరుద్యోగులకు ప్రయత్నాలు వాయిదా వేస్తారు.

# ఉపముఖ్యమంత్రి వ్యాఖ్యలు సమర్థనీయం...

**- ఎంపీ చామలకు చులకన భావము తగదు...**
**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**



తొలిఅడుగు, ధర్మపురి ప్రతినిధి, ఏప్రిల్ 30 : పెగడపెల్లి : ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే కాంగ్రెస్ పార్టీ నేతలు పాకిస్థాన్ వెళ్లాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సమర్థనీయమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ అన్నారు. పెగడపెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నలుగురు ఉగ్రవాదులు వచ్చి కాల్చిపోతే ఇంతవరకు తీవ్రవాదులను మోడీ ఎందుకు పట్టుకోలేదని చులకన భావంతో మాట్లాడిన ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రోజు భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పులు జరిగేవని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భారత సైనికులకు స్వేచ్ఛను ఇవ్వకపోవడం వల్ల నిత్యం భారత సైనికులు కాల్పులకు గురయ్యేవారని కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక శత్రుదేశాలతో పోరాడడానికి సైనికులకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో నేడు సరిహద్దు ప్రాంతంలో పహార కాస్తున్న సైనికులు ఆత్మస్థైర్యంతో శత్రువులకు ఎదురు నిలిచి పోరాటం చేస్తూ శత్రుదేశ సైనికులను మట్టికరిపిస్తున్నారని అన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ నాయకులు భారత సైనికులు చేసిన సర్జికల్ స్ట్రైక్ ను తప్పుపట్టడం భారతీయ ఆచార సంప్రదాయాలకు వ్యతిరేకంగా మాట్లాడి కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ భారతమాత అంటే ఎవరని అసలు భారతమాత ఉందా అంటే మరో కాంగ్రెస్ నేత ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దేశంలో ఉన్న భారతీయులందరికీ భారతమాత తల్లి అయితే మరి తండ్రులు ఎంతమంది అని ప్రశ్నించారని మరో కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ నేను పాకిస్థాన్ను ప్రేమిస్తా అని బాహాటంగా చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజలందరికీ హృదయాలను గాయపరిచాయని అన్నారు. ప్రస్తుతం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అదే కోవలో మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. జమ్మూ కశ్మీర్ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం వైఫల్యం వల్లనే ఉగ్రవాదులు హిందూ పర్యాటకులపై కాల్పులు జరిపారని ప్రపంచంలో పాకిస్థాన్ ను ఒంటరిని చేయడానికి మోడీ గారు పట్టు బిగించిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. 26/11 ముంబయి కాల్పుల్లో శిక్ష పడిన కసబ్ ను కాపాడడానికి అర్ధరాత్రి సుప్రీం కోర్టు తలుపులు తెరిపించిన ఘనత తహవూర్ రాణాకు కూడా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదేనని దుయ్యబట్టారు. భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా కాశ్మీర్ లో ఉగ్రవాదులు రాహుల్ ను కలిసి మాట్లాడాలని ఎందుకు కోరుకున్నారో ఎంపీ చామల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రైవేటు పాఠశాలలకు వద్దు గవర్నమెంట్ పాఠశాలలే ముద్దు

**- ప్రధానోపాధ్యాయులు నాగరాజు రెడ్డి**



తొలిఅడుగు, చిన్నకోడూర్, ఏప్రిల్ 30 : మండల పరిధి రాముని పట్ల గ్రామంలో విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా గవర్నమెంట్ పాఠశాలకు పంపించాలని కోరారు. విద్యార్థులకు హాలిడేస్ ఇచ్చిన సందర్భంగా ఎండలోనే తిరుగువద్దని సమ్మర్ క్లాసులు విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందన్నారు. చదువుతో పాటు .ఆటలు .పాటలు. నిర్వహిస్తున్నమని ప్రధాన ఉపాధ్యాయులు నాగరాజు రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ .ఎస్ .యు .ఐ గ్రామ శాఖ అధ్యక్షులు కర్రె .మధు, ఐకెపి సీసీలు సునీత, నాగలక్ష్మి ,రైటర్ ఎర్రవెల్లి శ్రీనివాస్. డాన్సర్లు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు టార్పలిన్ కవర్లు లేక రైతన్నలు ఇబ్బందులు

**- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జేరిపోతుల పెద్ద లక్ష్మణ్ .**

తొలి అడుగు, చిన్నకోడూరు, ఏప్రిల్ 30 : వరదలు రైతన్నలకు ఇవ్వడం లేదు ఇంతవరకు అకాల వర్షాలకు తడిసి ముద్దయిపోయిన పట్టించుకునే నాధులే కరువైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జేరుపోతుల పెద్ద లక్ష్మణ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు టర్పర్సన్ కవర్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిందన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే రైతన్నలకు కన్నీటి బాధలు తప్ప ఎలాంటి ఉపయోగాలు పడత లేవని మండిపడ్డారు. వెంటనే రైతులకు కవర్లు ఇవ్వాలని కోరారు.

# శ్రీ బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయం...

**- సర్వ మానవ హితాన్ని బోధించేది లింగాయత తత్వం**
**- డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**



తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 30 : బసవేశ్వరుడి సేవలు అనుసరణీయమని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో శ్రీ బసవేశ్వర జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూఢనమ్మకాలను వ్యతిరేకించిన ఆయన లింగాయత ధర్మాన్ని ఆచరణలో పెట్టినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా బసవేశ్వరుడి తల్లిదండ్రులు ఆచారం సాంప్రదాయాలను ఇష్టపడగా, అందుకు భిన్నంగా ఆయన భక్తి మార్గాన్ని ఎంచుకొని శివుడే సర్వేశ్వరుడని భావిస్తూ శివతత్వాన్ని ఆచరించినట్లు స్పష్టం చేశారు. అయితే అన్నమయ్య, వేమన తదితరుల రచనలు, బోధనలలో విప్లవాత్మక మార్పులకు బసవేశ్వరుడే కారణమని తెలిపారు. వైదిక కర్మలను వ్యతిరేకించిన ఆయన సర్వ మానవ హితాన్ని బోధించే లింగాయత తత్వాన్ని విస్తృత%శీ% చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సుఖేందర్ రెడ్డి, సంఘ బాధితులు డాక్టర్ కుమారస్వామి, బాల కుమార్, అమరవాది ప్రభాకర్, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, నేతలు కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, సమీర్, రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

## నాట్యకళ ఓ శక్తివంతమైన వారసత్వ సంపద

నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రేక్షకుల్లో ఉంటూ కళను ఆస్వదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏట 29 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా “అంతర్జాతీయ నాట్య దినోత్సవం” లేదా “ఇంటర్నేషనల్ డాన్స్ డే”ను యునెస్కోతో కలిసి ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా 1982 నుంచి నిర్వహించడమ ఆనవాయితీగా మారింది. ప్రపంచ ప్రఖ్యాత నాట్య కళాకారులు జీన్స్ జార్జెస్ నవ్వేరీ జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రజల వన్నులు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వయం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథకుల, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి. డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవను చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు సత్వరమే తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలి.

# ముఖ్యమంత్రి పదవి స్థాయిని దిగజార్చుతున్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

**– గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**



తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 30 : బుదవారం బసవ జయంతి కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి పదవి స్థాయిని దిగజార్చేలా ఉన్నాయని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బసవ జయంతి, పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదల కార్యక్రమంలో పనికిరాని మాటలు మాట్లాడి రేవంత్ రెడ్డి తానింకా ప్రతిపక్షంలోనే ఉన్నాడనే భావనతో తన స్థాయిని తానే దిగజార్చుకుంటున్నాడని అన్నారు.వరంగల్లో జరిగిన సభను జీర్ణించుకోలేని రేవంత్ రెడ్డి బసవ జయంతి కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తన అక్కసు వెళ్ళగక్కడం శోచనీయమన్నారు. మొన్న జరిగిన వరంగల్ సభలో కెసిఆర్ ఎంతో హుందాగా తెలంగాణ ఏర్పాటుకు పడ్డ కష్టాలతో పాటు కేవలం ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రజల సమస్యల మీదనే మాట్లాడి తన స్థాయిని పెంచుకునే రీతిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన తెచ్చుకోవడానికి సరిపడా సమయం ఇచ్చామని వారి అవగాహన లేమితో రాష్ట్రం అధోగతి పాలవుతుందని, గతంలో సజావుగా నడిచిన సంక్షేమ పథకాలను కూడా ఇవ్వలేక పోతుందని కేసీఆర్ ప్రజల్లో ఉన్న వాస్తవ అంశాలను ప్రస్తావిస్తే దానికి సమాధానం చెప్పే శక్తి లేని రేవంత్ రెడ్డి ఎప్పటిలాగానే కెసిఆర్ గారి మీద అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వారు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన అంశాలను అమలు చేసి వారి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో కేసీఆర్ కు తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, అభివృద్ధి ప్రదాతగా గొప్ప స్థానం ఉందని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడినంత మాత్రాన ఆ స్థానాన్ని తీసివేయలేరని అన్నారు. ముఖ్యమంత్రిగా అత్యంత గౌరవప్రదమైన స్థానాన్ని ప్రజలు రేవంత్ రెడ్డికి ఇచ్చినప్పటికీ ప్రజలకు అందించాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాలను అటకెక్కించి కేవలం కేసీఆర్ గారి మీద అవాకులు చివాకులు పేలడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చాలనే చీప్ పాలిటిక్స్ చేయడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజలు అత్యంత చైతన్యవంతమైన వారని ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం అయిపోయిందని గ్రహించే కెసిఆర్ గారి నాయకత్వాన్ని మరోసారి బలపరచాలనే ఆలోచనతోనే వరంగల్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ ప్రభుత్వానికి షాక్ ఇచ్చారన్నారు. ప్రజలు సభ విజయవంతం చేయడం ద్వారా ఇచ్చిన షాక్ కు తోడుగా కేసీఆర్ గారు తన ప్రసంగంలో ఎక్కడ రేవంత్ రెడ్డి గారి పేరు తీసుకోకపోవడంతో ఫ్రస్టేషన్లో రేవంత్ రెడ్డి గారు ఏది పడితే అది మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ పట్ల కెసిఆర్ కున్న కమిట్మెంట్ మరెవ్వరికీ లేదనే విషయం తెలంగాణ ప్రజలకు తెలుసని, ప్రజలు కష్టాల్లో ఉన్న ప్రతి సందర్భంలో కేసీఆర్ ప్రజల వెంబడే ఉన్నారన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. అదేవిధంగా గత 25 ఏళ్లుగా కేసీఆర్ వెంబడే తెలంగాణ సమాజం ఉందని అన్నారు. తెలంగాణ చరిత్ర నుండి గాని తెలంగాణ ప్రజల నుండి గాని కెసిఆర్ గారిని ఎవరు విడదీయలేరని కెసిఆర్ ఎప్పుడు తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడుతూనే ఉంటారని అన్నారు. తెలంగాణ సాధకుడిగా గొప్ప పరిపాలనా దక్షుడిగా తెలంగాణ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కేసీఆర్ గారి చావును కోరుకోవడం, సమాధి అవుతారని మాట్లాడడం రేవంత్ రెడ్డి అవివేకానికి,అహంకారానికి నిదర్శనం అన్నారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్ని తెలంగాణ ప్రజలు ఎవరు హర్షించారని కచ్చితంగా రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పి తీరుతారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనందుకు, కెసిఆర్ మీద చేసిన వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఈ పనికిరాని చిల్లర మాటల్ని బంద్ చేసి పరిపాలన మీద దృష్టి పెట్టాలని లేనిపక్షంలో తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం ధర్నా




తొలిఅడుగు, మణుగూరు ఏప్రిల్ 30 : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు మరియు ఇతర సౌకర్యాలు విషయమై కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు ఒకరోజు నిరసన దీక్ష మరియు మహాధర్నా చేయడం జరిగింది. ఈ యొక్క నిరసన దీక్షలో కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం తరపునుంచి మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ వరదలు సమ్మయ్య పాల్గొని సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ 22 జీవోను వెంటనే అమలు చేయాలని, వైద్య సౌకర్యం కల్పించాలని, పండగల రోజున పని చేస్తే ఒక మస్టర్కు మూడు మస్టర్లు ఇవ్వాలని ప్రస్తుతం ఒక మస్టరుకు అదనంగా ఒక్క మస్టర్ మాత్రమే ఇస్తున్నారు. ఆదివారం పని చేస్తే ఒక మస్టరుకు అదనంగా మరో మస్టరు ఇవ్వాలి. ప్రస్తుతం ఆదివారం పని చేస్తే చేసిన మస్టర్ మాత్రమే చెల్లిస్తున్నారు. జీతాలకు సంబంధించిన పేమెంట్ పేపర్స్ ఇవ్వాలని అలాగే సింగరేణిలోని ఖాళీగా ఉన్న క్వార్టర్స్ ను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమం అన్ని సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేయడం జరిగింది.

# ఎయిర్‌టెల్ సిమ్ డెలివరీ సేవలు నిలిపివేత

తొలిఅడుగ్స్: న్యూఢిల్లీ, : ఇంటికే సిమ్ డెలివరీ సేవలను అట్టహాసంగా ప్రారంభించిన ఎయిర్‌టెల్ ఈ సేవలను అర్థాంతంగా నిలిపివేసినట్టు తెలుస్తున్నది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం మంత్రిత్వ శాఖ పలు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో ఈ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. సిమ్ బుక్ చేసుకున్నవారికి వెంటనే అందించాలనే ఉద్దేశంతో ఎయిర్‌టెల్..బ్లింకిట్‌తో జతకట్టిన విషయం తెలిసిందే. సెల్ఫ్–కేవైసీ ప్రాసెసింగ్, ఇతర విషయాలపై టెలికం శాఖ పలు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో ఈ సేవలను ప్రస్తుతానికి నిలిపివేసినట్టు ఎక్స్‌లో వెల్లడించింది. హైదరాబాద్‌తోపాటు ఒకేసారి 15 నగరాల్లో సిమ్ డెలివరీ సేవలను ఏప్రిల్ 15న ప్రారంభించిన విషయం తెలిసిందే.



# ఇంటి పన్ను వసూలు



తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 30 : 30-04-2025 రోజున 32.19 లక్షల రూపాయలు అదేవిధముగా ఈ సంవత్సరం 2025-26 సంబందించిన ఆస్తి పన్ను మొత్తంపై 5% వరకు రిబెట్ (డిస్కౌంట్)లో ఇంటి పన్ను 155.0 లక్షలు 1755 అస్సిస్మెంట్స్ శాతం-24% వసూలు కాగా అదేవిధముగా గత సంవత్సరం 2025-26లో ఇంటి పన్ను 155.0 లక్షలు 1755 అస్సిస్మెంట్స్ శాతం-24%. 2024-25లో 128 లక్షల రూపాయలు, 1407 అస్సిస్మెంట్లు, 2023-24లో 76.83 లక్షల రూపాయలు, 1065 అస్సిస్మెంట్లు. 2022-23లో 85.66 లక్షల రూపాయలు 1268 వసూలు చేసినటు కమీషనర్ గోల్కొండ నర్సయ్య తెలియజేశారు.

# నియోజకవర్గ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించిన పినపాక ఎమ్మెల్యే





తొలిఅడుగు, మణుగూరు, ఏప్రిల్ 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజాభవన్ లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించిన ఎమ్మెల్యే పాయం. వారు మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన అగ్రికల్చర్ రివ్యూ మీటింగ్ కు వచ్చిన ఏడీఏ తాతారావుకి, నియోజకవర్గస్థాయి వ్యవసాయ శాఖ అధికారులకు రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని రైతులకు అందించే సేవలు పై మాట్లాడారు. వర్షాకాలంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా ముందు రోజుల్లో చర్యలు తీసుకోవాలని అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందించిన పథకాలు రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, సన్న వడ్లకు 500 వందలు బోనస్, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇలా అనేక విషయాలపై చర్చించారు, అదేవిధంగా నియోజకవర్గంలో అన్ని మండలాలలో సమయానికి ఎరువులు, విత్తనాలు, రైతులకు ఏది అవసరం అనేదానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులకు అభినవ సంబంధాలు ఉంటాయని వాటిని ఎప్పటికీ అదేవిధంగా కొనసాగించాలని రైతులకు కష్టం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని పినపాక నియోజకవర్గ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీఏ తాతారావు, పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గస్థాయి అగ్రికల్చర్ ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జనగామ అమ్మ ఫౌండేషన్





తొలిఅడుగు, జనగామ, ఏప్రిల్ 30 : జనగామ జిల్లా ఆసుపత్రిలో మహిళాకి అత్యవసరంగా ఆపరేషన్ నిమిత్తం రక్తదానం చేసిన సల్ల రవి ,తాటి స్నేహిత్ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు జిల్లా ఆసుపత్రి నుంచి అత్యవసర ఆపరేషన్ నిమిత్తం కావలసిందిగా మహిళా పేషంట్ తరఫున ఫోన్ చేయడం జరిగింది వెనువెంటనే మాకు తెలిసిన మిత్రులకు ఫోన్ చేయగా వచ్చి అత్యవసరంగా రక్తదానం చేసి ప్రాణదత్తలుగా నిలిచిన సల్ల రవి తాటి స్నేహిత్ కి అమ్మ ఫౌండేషన్ టీం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. జనగామ జిల్లా ఆసుపత్రిలో రక్త నిధి ఏర్పాటు లక్ష్యంగా ప్రతి ఒక్కరు అత్యవసర సమయాలు ఆపరేషన్ నిమిత్తం యాక్సిడెంట్ తదితర కారణాలతో వచ్చిన వారికి రక్తం దొరకడం లేదు వరంగల్ హైదరాబాద్ మహానగరాలకు వెళ్లడం జరుగుతుంది కాబట్టి విలువైనప్రాణాలు గాల్లో పోతున్నాయి ప్రజలు యువత దూరదృష్టం ఆలోచించి జనగామ జిల్లా ఆసుపత్రిలో రక్తప్రధి ఏర్పాటు లక్ష్యంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతలు నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ కరుణాకర్ డాక్టర్ దివ్య మేడం వెంకటస్వామి మహమ్మద్ రషీద్ అమ్మ ఫౌండేషన్ టీం కొయ్యడ రవి నల్ల వినోద్ పండుగ నరేష్ బోట్ల సాయి మల్లెల అంజి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా ఆర్థికానికి బీటలు



తొలిఅడుగు, వాషింగ్టన్, : అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక వ్యవస్థకు బీటలు పడ్డాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికానికిగాను(జనవరి-మార్చి మధ్యకాలంలో) వృద్ధిరేటు 0.3 శాతంగా నమోదైంది. గడిచిన మూడేండ్లలో ఇదే తక్కువ స్థాయి వృద్ధిరేటు. 202 ప్రతీకార సుంకాల విధింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గుచూపడంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, ముఖ్యంగా దిగుమతులు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. %గతేడాది చివరి త్రైమాసికంలో నమోదైన 2.4 శాతం కంటే భారీగా తగ్గిందని తెలిపింది. ట్రంప్ సుంకాల విధింపుతో దిగుమతులు 5 శాతం పడిపోవడం వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణమని తెలిపింది. దీంతోపాటు వినియోగదారులు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా వృద్ధి పరుగుకు బ్రేక్‌లు వేశాయని వెల్లడించింది. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 2 శాతం పడిపోగా, డౌజోన్స్ 702 పాయింట్లు లేదా 1.7 శాతం పతనం చెందింది.

# తగ్గేదేలే.. అక్షయ తృతీయ అమ్మకాలు అదుర్స్

తొలిఅడుగు, న్యూఢిల్లీ, : అక్షయ తృతీయ కొనుగోళ్లు అంచనాలను మించి జరిగాయి. అధిక ధరలున్నా బంగారం అమ్మకాలు బాగానే జరిగాయని జ్యువెల్లర్స్ వెల్లడించారు. ఈ క్రమంలోనే గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది విక్రయాల విలువ 35 శాతం పెరుగుతుందన్న అంచనాను అఖిల భారత రత్నాలు, ఆభరణాల మండలి (జీజేసీ) వ్యక్తం చేస్తున్నది. నిరుడు 20 టన్నుల మేర సేల్స్ జరిగాయి. నిజానికి గతకొద్ది రోజులుగా ధరలు పెరుగుతూపోవడంతో కొనేందుకు అంతా సందేహించారని, అయితే ఇప్పుడు రేట్లలో స్థిరీకరణ రావడంతో కస్టమర్లు దుకాణాలకు పెద్ద ఎత్తున వచ్చారని జీజేసీ చైర్మన్ రాజేశ్ రోకెడె పీటీఐకి తెలిపారు. కాగా, గత ఏడాది అక్షయ తృతీయ రోజు (మే 10, 2024)న తులం బంగారం రూ.72,300గా ఉన్నది. అయితే ఇప్పుడిది రూ.98,550 పలికింది. అయినప్పటికీ కస్టమర్లు కొనేందుకే ముందుకురావడంపట్ల జ్యువెల్లర్స్ ఆనందం వెలిబుచ్చుతున్నారు.

12 టన్నుల మేర..

దాదాపు 12 టన్నుల బంగారం అమ్మకాలు జరుగవచ్చని అఖిల భారత వర్తకుల సమాఖ్య అంచనా వేస్తున్నది. దీని విలువ రూ.12,000 కోట్లుగా ఉండొచ్చని చెప్తున్నది. అలాగే రూ.4,000 కోట్ల విలువైన 400 టన్నుల వెండి విక్రయాలు జరిగాయని భావిస్తున్నది. మొత్తంగా ఈ ఒక్కరోజే రూ.16,000 కోట్ల విలువైన వ్యాపారం జరిగిందన్న సమాచారం తమకు అందుతున్నట్టు ట్రేడర్స్ పేర్కొంటున్నారు. ఇక ఉదయం సమయంలో దుకాణాల్లో కాస్త కస్టమర్ల సందడి తక్కువగానే ఉన్నా.. మధ్యాహ్నం నుంచి పుంజుకుందని, సాయంత్రం ఇంకా పెరిగిందని జ్యువెల్లర్స్ తెలిపారు. చాలా నగరాల్లో అర్ధరాత్రిదాకా విక్రయాలు జరుగడం గమనార్హం.

కడ్డీలు, నాణేలకు డిమాండ్

వినియోగదారుల్లో 25-40 ఏండ్ల వయస్సువారు గోల్డ్, సిల్వర్ కడ్డీలు, నాణేలను కొనేందుకే ఎక్కువగా ఆసక్తి చూపినట్టు నగల వ్యాపారులు వెల్లడించారు. అయితే బడ్జెట్, అవసరాన్నిబట్టి ఆభరణాలు, నాణేలు, కడ్డీలకు డిమాండ్ కనిపించినట్టు తెలియజేశారు. ఇక పాత బంగారు నగలు ఇచ్చి కొత్త బంగారం నగలను కొనుక్కునేవారు కూడా ఈసారి పెరిగారని, తమకు సుమారు 50 శాతం సేల్స్ అలాగే జరిగాయని పీఎన్‌జీ జ్యువెల్లర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు.

మార్కెట్‌లో తగ్గిన ధరలు

దేశీయ మార్కెట్‌లో బుధవారం బంగారం ధరలు క్షీణించాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.98,550గా ఉన్నది. మంగళవారంతో పోల్చితే రూ.900 పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన ట్రెండ్ ఇందుకు కారణంగా అఖిల భారత సరఫా అసోసియేషన్ పేర్కొంటున్నది. కాగా, కిలో వెండి ధర ఏకంగా ఈ ఒక్కరోజే రూ.4,000 దిగింది. రూ.98,000కు పరిమితమైంది. అంతర్జాతీయంగా చూస్తే.. స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ 3,273.90 డాలర్లు పలికింది. 43.35 డాలర్లు తగ్గుముఖం పట్టింది. వెండి కూడా 32.33 డాలర్లుగానే ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం రూ.97,910గా ఉన్నది. రూ.60 తగ్గింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పుత్తడి రేటు రూ.50 దిగి రూ.89,750గా ఉన్నది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# నాని రూట్ లో సమంత.. మొదటి సినిమాతో విజయం దక్కేనా



తొలిఅడుగు, కొన్ని విషయాలు ప్లస్సా? మైనస్సా అంటే ఆన్సర్ ఉండదు. స్టార్ల ప్రొడక్షన్ హౌస్‌లో సినిమా ఛాన్స్ వచ్చిందని ఆనందించాలా? లేకుంటే అన్నీ తామై వాళ్లు ముందుకు నడిపిస్తుంటే.. మనకు ఫేమ్ రాదని ఫీలవ్వాలా? ఇప్పుడిదో ఇంట్రస్టింగ్ డిస్కషన్. కోర్టు సినిమా చూడండి. నచ్చితే నా హిట్3ని చూడండి.. లేకపోతే అసలు చూడొద్దు అంటూ నేచురల్ స్టార్ ఇచ్చిన స్టేట్‌మెంట్ విని.. ఇది కాన్ఫిడెన్సా? ఓవర్ కాన్ఫిడెన్సా? కోర్టులాంటి సినిమా కోసం తన సినిమాను తాకట్టు పెడతారా? అంటూ భారీ చర్చే జరిగింది ఇండస్ట్రీలో. అయితే, బేఫికర్ అన్నారు నాని. అంతలా ఆ సినిమాను భుజానకెత్తుకుని మోశారు. ఇప్పుడు సమంత కూడా నానికి ఏమాత్రం తీసిపోవడం లేదు. ఆమె నిర్మిస్తున్న సినిమా శుభం మే 9న విడుదల కానుంది. శుభంలో నటించిన వారిని చూస్తుంటే ముచ్చటేస్తుంది. అసలు కెరీర్ తొలినాళ్లలో నా నటనను చూసుకుంటే నాకు సిగ్గేస్తుందని అన్నారు. ఓపెన్ డయాస్ మీద సెలబ్రిటీ ప్రొడ్యూసర్లు ఇస్తున్న స్టేట్‌మెంట్లకు ఆశ్చర్యపోతున్నారు జనాలు. నానికి కోర్టు ఆడినట్టు, సామ్‌కి శుభం ఆడుతుందా? అని ఇంట్రస్ట్ గా గమనిస్తున్నారు. అన్నట్టు.. శుభం ట్రైలర్‌కి మంచి మార్కులే పడుతున్నాయి.



# షారుఖ్ అభ్యర్థన మేరకు..



తొలిఅడుగు, బాలీవుడ్‌లో షారుఖ్, దీపికా పడుకోన్ కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిందీ చిత్రసీమలో హిట్‌పెయిర్‌గా వారికి గుర్తింపు ఉంది. ఇప్పటివరకు వీరిద్దరు కలిసి ఐదు చిత్రాల్లో నటించగా..అవన్నీ సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. తాజాగా ఈ జోడీ 'కింగ్' సినిమాలో నటించనుంది. షారుఖ్‌ఖాన్ తనయ సుహానా ఖాన్ ప్రధాన పాత్ర లో రూపొందుతున్న ఈ చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. సుహానాఖాన్ గురువు పాత్రలో షారుఖ్‌ఖాన్ నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో దీపికా పడుకోన్ అతిథి పాత్రలో నటిస్తుందంటూ వార్తలొచ్చాయి. అవన్నీ పుకార్లేనని చిత్రబృందం కొద్ది వారాల క్రితం వివరణ ఇచ్చింది. తాజా సమాచారం ప్రకారం దీపికా పడుకోన్ ఈ సినిమాలో భాగం కానుందని తెలిసింది. తొలుత ఈ సినిమా కోసం 'కింగ్' టీమ్ తనను సంప్రదించినప్పుడు దీపికా పడుకోన్ సున్నితంగా తిరస్కరించిందట. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలతో పాటు పర్సనల్ లైఫ్‌కు సమయాన్ని కేటాయించాల్సి ఉందని, కొత్త సినిమాలు సైన్ చేయలేనని చెప్పిందట. ఆ తర్వాత అతిథి పాత్ర కోసం కత్రినాకైఫ్, సోనమ్ బజ్వా, ప్రీతిజింటా వంటి తారల్ని సంప్రదించారు. వారు కూడా పలు కారణాలతో ఒప్పుకోక పోవడంతో చివరకు షారుఖ్‌ఖాన్ రంగంలో దిగారు. దీపికా పడుకోన్‌ను ఫోన్‌లో సంప్రదించిన షారుఖ్‌ఖాన్ ఎలాగైనా అతిథి పాత్రలో నటించాలని అభ్యర్థించారట. ఆమె డేట్స్ కోసం అవసరమైతే షూటింగ్ షెడ్యూల్స్‌ను మార్చుతామని హామీ ఇచ్చారట. షారుఖ్ రిక్వెస్ట్ మేరకు చివరకు దీపికా సినిమాకు ఓకే చెప్పిందని బాలీవుడ్ టాక్. ఈ సినిమాను మేలో మొదలుపెట్టి ఆగస్ట్‌లోగా పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. అయితే దీపికా పడుకోన్ కాల్షీట్స్ అక్టోబర్‌లో అందుబాటులో ఉండటంతో అప్పటి వరకు వేచిచూడాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారని బాలీవుడ్ ఇండస్ట్రీ టాక్.

# నగరం, తుపాకీ రెండూ ఒకటే..

తొలిఅడుగు, 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కింగ్ జాకీ క్వీన్'. కేకే దర్శకుడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఇందులో దీక్షిత్‌శెట్టి రాజు పాత్రలో, యుక్తి తరేజా రాణి పాత్రలో కనిపించారు. 'నగరం, తుపాకీ రెండు ఒకటే, అవి వాటిని పట్టుకున్న వ్యక్తి మాట వింటాయి' అంటూ రాజు చెప్పే డైలాగ్‌తో టీజర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది. 'కత్తితో జీవించేవాడు కత్తితో చనిపోతాడు' అనే బైబిల్ నోట్‌తో టీజర్‌ను ముగించిన తీరు ఆకట్టుకుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దీక్షిత్ శెట్టి తెలిపారు. 1990ల నేపథ్యంలో నడిచే పీరియాడిక్ క్రైమ్ డ్రామా ఇదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాగేష్ బానెల్, సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి, దర్శకత్వం: కేకే.



# 1960 నాటి తెలంగాణ కథ 'భోగి'



తొలిఅడుగు, 1960ల నాటి ఉత్తర తెలంగాణ నేపథ్య కథాంశంతో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రానికి 'భోగి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. బుధవారం నుంచి షూటింగ్ మొదలుపెడుతున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. విధి, పోరాటం, మార్పు అంటూ దర్శకుడు కథను నరేట్ చేస్తుండగా..హీరో శర్వానంద్ ఆయన మాటల్ని ఆసక్తిగా వింటూ ఓ యుద్ధం, సంఘర్షణతో కూడిన ప్రపంచాన్ని ఊహిస్తుంటాడు. తిరుగుబాటుదారుడి వీరోచిత పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తమని అర్థమవుతున్నది. 'ప్రతి రక్తపు చుక్కకు ఓ కారణం ఉంటుంది. ప్రతి పండగకు ఓ ప్రయోజనం ఉంటుంది' అని దర్శకుడు సంపత్‌నంది ఈ వీడియోపై వ్యాఖ్యానించారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో జరిగే కథాంశమిదని, అప్పటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టేలా అద్భుతమైన సెట్స్‌కు రూపకల్పన చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, ఆర్ట్: కిరణ్ కుమార్ మన్నె, రచన-దర్శకత్వం: సంపత్‌నంది.

# చెన్నై ఔట్.. రాణించిన అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ పంజాబ్ కింగ్స్ ఘన విజయం

తొలిఅడుగు,: చెన్నై: పంజాబ్ కింగ్స్ సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టింది. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో చెన్నైపై పంజా విసిరింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సొంత ఇలాఖాలో వరుసగా ఐదో ఓటమిని ఖాతాలో వేసుకున్న చెన్నై ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. చెన్నై నిర్దేశించిన 191 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(41 బంతుల్లో 72, 5ఫోర్లు, 4సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్‌సింగ్(36 బంతుల్లో 54, 5ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. పతిరన(2/45), ఖలీల్(2/28) రెండేసి వికెట్లు తీశారు. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. 19.2 ఓవర్లలో 190 పరుగుల భారీ స్కోరు చేసింది. సామ్ కరన్ (47 బంతుల్లో 88, 9 ఫోర్లు, 4 సిక్సర్లు), డెవాల్డ్ బ్రెవిస్ (32) రాణించారు. కింగ్స్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ (4/32) ఈ సీజన్‌లో తొలి హ్యాట్రిక్‌ను నమోదుచేయగా అర్ష్‌దీప్ (2/25), యాన్సెన్ (2/30) తలా రెండు వికెట్లు పడగొట్టారు. అయ్యర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.




### కింగ్స్ దూకుడు

యువ ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్ ఆరంభం నుంచే దూకుడు మంత్రాన్ని జపించడంతో పంజాబ్ స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. ఖలీల్ తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ రెండు బౌండరీలతో ఇన్నింగ్స్‌ను ఆరంభించగా అన్షుల్ నాలుగో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ 6, 4 దంచాడు. ఖలీలే వేసిన 5వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన ప్రియాన్ష్.. నాలుగో బంతికి ధోనికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. పవర్ ప్లే తర్వాత స్పిన్నర్ల రాకతో కింగ్స్ స్కోరు వేగం కాస్త నెమ్మదించింది. పతిరాన 11వ ఓవర్లో ఆఖరి బంతిని బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా బౌండరీకి తరలించిన ప్రభ్‌సిమ్రన్.. ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని పూర్తిచేశాడు. క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడిన ప్రభ్‌సిమ్రన్..నూర్ అహ్మద్ బౌలింగ్‌లో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్‌ను అనుసరిస్తూ నేహాల్ వధేరా(5) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఓ వైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చెన్నై బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ లక్ష్యాన్ని అంతకంతకూ కరిగించుకుంటూ పోయాడు. ఆఖర్లో పది పరుగుల తేడాతో మూడు కీలక వికెట్లు శశాంక్(23), అయ్యర్, సూర్యాంశ్(1) చేజార్చుకున్నా..పంజాబ్ విజయతీరాలకు చేరింది.

### కరన్ కుమ్మేశాడు

చెన్నై ఇన్నింగ్స్‌లో కరన్ ఆటే హైలైట్. 6 ఓవర్లలో మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ సీఎస్‌కేను బ్రెవిస్ అండతో అతడు ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ తప్ప చెన్నై బ్యాటర్లలో ఒక్కరు కూడా 20 పరుగుల మార్కును దాటలేదు. ఈ సీజన్‌లో సరైన ఆరంభాలు లేక తంటాలు పడుతున్న చెన్నైకి ఈ మ్యాచ్‌లోనూ ఆ తిప్పలు తప్పలేదు. యువ ఓపెనర్లు రషీద్ (11), అయుశ్ (7) విఫలమవగా.. నాలుగో స్థానంలో వచ్చిన జడేజా (17) నాలుగు బౌండరీలతో అలరించినా అతడూ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. పవర్ ప్లేలో చెన్నై చేసిన స్కోరు 48/3. ఈ క్రమంలో కరన్.. సీఎస్‌కే తనమీద ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. హర్‌ప్రీత్ బ్రర్ 8వ ఓవర్లో సిక్స్ బాదిన అతడు.. చాహల్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు కొట్టాడు. కరన్‌కు అండగా నిలిచిన బ్రెవిస్.. క్రీజులో కుదురుకుంటున్న తరుణంలో 15వ ఓవర్లో అజ్మతుల్లా అతడిని బౌల్డ్ చేయడంతో 78 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్లో మూడో బంతికి డబుల్ తీసి హాఫ్ సెంచరీ సాధించిన కరన్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. షెడ్గె వేసిన మరుసటి ఓవర్లో అతడు 6, 6, 4, 4తో ఏకంగా 26 రన్స్ రాబట్టాడు. ఒక ఓవర్లో చెన్నై ఇన్ని పరుగులు చేయడం ఈ సీజన్‌లో ఇదే ప్రథమం. కరన్‌తో పాటు దూబె కూడా క్రీజులో ఉండటంతో చెన్నై జోరు చూస్తే 220 ప్లస్ దాటుతుందేమో అనిపిస్తుంది. కానీ యాన్సన్ బౌలింగ్‌లో కరన్ ఔట్ అవడంతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ కుదేలైంది.

### చాహల్ హ్యాట్రిక్

కరన్ నిష్క్రమించినా దూబెతో పాటు ధోని (11) క్రీజులో ఉండటంతో చెన్నై భారీ స్కోరే సాధిస్తుందని అభిమానులు ఆశించారు. కానీ 18వ ఓవర్లో చాహల్.. 4 కీలక వికెట్లు (ఇందులోనే హ్యాట్రిక్) పడగొట్టి చెన్నైని కట్టడిచేశాడు. రెండో బంతికి ధోనిని ఔట్ చేసిన అతడు.. 4, 5, 6 బంతుల్లో హుడా (2), కంబోజ్, నూర్ అహ్మద్‌ను ఔట్ చేసి ఈ సీజన్‌లో తొలి, మొత్తంగా తన కెరీర్‌లో రెండో హ్యాట్రిక్‌ను నమోదుచేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 19.2 ఓవర్లలో 190 ఆలౌట్ (కరన్ 88, బ్రెవిస్ 32, చాహల్ 4/32, అర్ష్‌దీప్ 2/25)బీ పంజాబ్: 19.4 ఓవర్లలో 194/6(అయ్యర్ 72, ప్రభ్‌సిమ్రన్ 54, ఖలీల్ 2/28, పతిరన 2/45)

# బంగ్లాదే రెండో టెస్టు సిరీస్ సమం




తొలిఅడుగు, చత్తోగ్రమ్: స్వదేశంలో జింబాబ్వేతో తొలి టెస్టులో ఎదురైన ఓటమికి రెండో టెస్టులో బంగ్లాదేశ్ బదులు తీర్చుకుంది. చత్తోగ్రమ్ వేదికగా మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో బంగ్లా ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. షాద్మన్ (120)తో పాటు మెహిదిహసన్ మిరాజ్ (104) శతకాలతో కదం తొక్కడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 444 పరుగుల భారీ స్కోరు చేసింది. దీంతో ఆ జట్టు 217 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన జింబాబ్వే.. 46.2 ఓవర్లలో 111 రన్స్‌కే ఆలౌట్ అయింది. బెన్ కరన్ (46) టాప్ స్కోరర్. బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన మిరాజ్.. బంతితోనూ ఐదు (5/32) వికెట్లు పడగొట్టి బంగ్లా విజయంలో కీలకపాత్ర పోషించాడు. మిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

# సురభికి కాంస్యం

తొలిఅడుగు, న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ షూటర్ రావూరి సురభి భరద్వాజ్ కాంస్య పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల 50మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన సురభి 620 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ మాన్ని కౌశిక్ (626), సిఫ్ట్‌కౌర్ సమ్రా(622) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఇదే టోర్నీలో రాష్ట్రానికి చెందిన దవళిక దేవి జూనియర్ విభాగంలో పతకం సాధించింది.




# వైభవ్‌కు పియాస్ట్రి ప్రశంసలు

తొలిఅడుగు,జైపూర్: రాజస్థాన్ రాయల్స్ చిన్నోడు, ఐపీఎల్‌లో రికార్డు శతకంతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ప్రశంసల జడివానలో తడిసి ముద్దవుతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 35 బంతుల్లోనే శతకం బాదిన వైభవ్ ఆటకు భారత క్రికెటర్లతో పాటు ప్రముఖ ఎఫ్1 రేసర్ ఆస్కార్ పియాస్ట్రి (ఆస్ట్రేలియా) సైతం ముగ్ధుడయ్యాడు. తాజాగా ఈ మెక్‌లారెన్ డ్రైవర్ తన ఇన్‌స్టా రీల్స్‌లో.. వైభవ్ ఫొటోతో కూడిన రీల్‌ను షేర్ చేశాడు. ఈ రీల్‌కు అతడి వయసును సూచించేలా '14' అని రాసి పక్కనే క్లాప్స్ కొడుతున్న ఎమోజీని ఉంచాడు. క్రికెట్ అభిమాని అయిన పియాస్ట్రి.. గతంలో పలుమార్లు తనకు ఈ ఆట, ఆటగాళ్లపై ఉన్న అభిమానాన్ని బహిరంగంగానే వెల్లడించిన విషయం తెలిసిందే.

